19022024-DIS-04_Layout 1 2/19/2024 4:14 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నిలబెడదామనే తలపోతేదీ ?

మేడారం.. మేడిగడ్డ.. ఒకే సానువు మీది రెండు వేర్వేరు సదృశ్యాలు. ఒకటి 700 ఏండ్ల కిందటి రక్త చరిత్ర అయితే.. మరొకటి ఇంకా తడి ఆరని జలధాత్ర. మేడారం కోటి జనాల జాతరైతే.. మేడిగడ్డ శత కోటి ఘనపుటడుగుల జల పాతర. రాష్ట్రంలో ఇప్పుడివే ట్రెండింగ్. పచ్చగున్న మేడారంలో కాలం అడ్డం తిరిగింది. కరువు కాటేసింది.. మేడారం బీడయింది. అయినా 'కప్పం కట్టు' అని ఫర్మానా ఇచ్చిండు ప్రతాపరుద్రుడు. 'కట్టలేం దొర' అని ప్రత్యుత్తరం పంపిండు పగిడిద్దరాజు. కాకతీయ రాజు కన్నెర్రజేసిండు. కదన రంగానికి రమ్మన్నడు. మదపుటేనుగుల బలుపు ప్రతాపరుద్ర సేనలదైతే.. గెరిల్లా ఒడుపు పగిడిద్దరాజుది. సంపెంగ వాగొడ్డే యుద్ధ భూమి. గిరిజన బిడ్డల నెత్తురు చిందింది. రాచకత్తి కర్కశానికి పగిడిద్దరాజు తల తెగింది. సమ్మక్క, సారలమ్మ, జంపన్న అమరులయ్యారు. ఆనాటి ప్రాణ త్యాగమే ఇవాళ జన మనాది అయింది.. మేడారం జాతరయ్యింది.



వర్దెల్లి వెంకటేశ్వర్లు

కాలం గతించింది. కరువు కోరలు తొడిగింది. అది తెలంగాణను అలుముకుంది. కరువు కౌగిలికి ప్రతి ఇల్లు వల్లకాడయింది. ఈ గోస పడలేక సారు పోయి.. సావు నోట్లె తలపెట్టంగ.. తన్లాడినోళ్లు.. తనువులిచ్చినోళ్లు.. పాట పాడినోళ్లు.. రాతలు రాసినోళ్లు.. చేతలు చేసినోళ్లు.. ఇట్లా ఎవరి త్యాగం వాళ్లది. ప్రతీదీ వెలకట్టలేని త్యాగమే. ఎట్టయితే ఏంది! 60 ఏండ్ల కొట్లాట ఫలించి స్వరాష్ట్రం కల సాకారమైంది. ముందుండి కొట్లాడిన సారే కొలువు కూటాల మీదికొచ్చిండు. వస్తూనే కరువు కోరలు పీకే పని పెట్టుకున్నడు. తెలంగాణను విత్తన భాండాగారం చేస్తానని కంకణం కట్టుకున్నడు. కాళేశ్వరం మహాయజ్ఞాన్ని తలం చిండు. కాళేశ్వరం మహా యజ్ఞమంటే! శివుని జటాఝూటాలను మత్తడిగ మలిచి గంగను నేలకు దించే అపర భగీరథ ప్రయత్నమే. నదికి నడకలు నేర్పింది సప్తర్షి మునుల్లో ఒకరైన గౌతముడని అంటరు. నడక నేర్చిన నదికి దిశను చూపి దక్షిణాది గంగను ఉత్తరవాహినిగా మార్చిన ఘనత మాత్రం కేసీఆర్‌దే. బీడువడ్డ నేలకు గోదారి నీళ్లను మళ్లించి అన్నదాత కాళ్లు కడిగిన అపర రాజర్షి అయిండు.

700 ఏండ్ల కింద అంటే ధర్మయుద్ధం ఉండేది. ఓ యుద్ధ నీతి ఉండేది. ఇప్పుడంత కుటిల రాజకీయాలే. నీతి తప్పిన కయ్యాలే! అందుకే తెలంగాణ ప్రాణధార కాళేశ్వరం కయ్యపు తునకగా మారింది. ఒక్కొక్క ఒర్రె నీళ్లను ఒడిసిపట్టి నెర్రెలు బారిన నేలకు నీళ్లిచ్చిన ఈ ప్రాజెక్టు మీద ఇప్పుడు పర్రెల పంచాయితీ మోపయింది. గోదావరికి ఎదురొడ్డి పారే నీళ్లను మల్లాల్సిన మేడిగడ్డ కుంగటమనేది దురదృష్టకరం. సమర్థనీయం కూడా కాదు. జలయుద్ధంలో గాయపడ్డ మహాయోధునిలాగా కాళేశ్వరం నిలబడ్డది. రోజుకో టీం పర్యటిస్తున్నది. పర్రెల్లో పుర్రెలు దూర్చి ఆలోచనలు చేస్తున్నది. కండ్లు పొడుచుకొని చూస్తున్నది. అక్కడికి అడుగుపెట్టిన ప్రతి ఒక్కరిదీ కుంగింది అనే వల పోతే గానీ, మళ్లీ నిలబెడదామనే తలపోత మాత్రం లేదు.



> కాళేశ్వరం అంటే కుంగిన ఆ నాలుగు పిల్లర్లు, ఈ రెండు పర్రెలేనా? మాజీ నీళ్ల మంత్రి హరీశ్‌రావు చెప్పినట్టు.. కాళేశ్వరం అంటే పవిత్రమైన ఓ శరీరం. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం.. ఈ మూడు నదీగర్భ జలాశయాలు, 16 భూ ఉపరితల రిజర్వాయర్లు, 228 పిల్లర్లు, 21 బాహుబలి మోటార్ల పంప్‌హౌజ్‌లు, 20 లిఫ్టులు, 203 కిలోమీటర్ల పొడవైన సొరంగాలు, 1,531 కిలోమీటర్ల పొడవైన కాల్వలు.. ఇవన్నీ కలిస్తేనే కాళేశ్వరం.

బుద్ధిజీవులు, సృజనకారులు, పాలకులు చూడాల్సింది కాళేశ్వరం కట్ట కింద పర్రెలిచ్చిన పిల్లర్లను మాత్రమే కాదు. అటునుంచి ఎల్లంపల్లి గట్టును తట్టి చూస్తే! అక్కడ వెన్ను విరుచుకున్న వరికంకులుంటయి. ఎగువమానేరు ఎక్కి, దిగువ మానేరు దిగితే! తడిసిన మడికట్ల మధ్య రొమ్ము విరుచుకొని నిలబడ్డ అన్నదాతల విగ్రహం.. నిగ్రహం కనపడతది.

మల్లన్నసాగర్, కొండపోచమ్మ పంట చేల మధ్య బుర్ర మీసం మెలేసి, గుప్పుగుప్పున గుంజిడిసిన మోతుబరి సుట్టకమురు.. కాళేశ్వరం నీళ్ల ఘాటెంతో చెప్తది. అక్కడి నుంచి ఎస్సారెస్పీ కాల్వలు, కట్టుగాల్వలు, గొలుసుకట్టు చెరువులు, పల్లెలు, పంట పొలాలను తడిమి చూడు! నీళ్లున్న చెరువులుంటయ్.. చెరువుల్లో చేపలుంటయ్. జపం చేసే కొంగలుంటయ్. వల విసిరే ముదిరాజులుంటరు. గౌండ్లోళ్ల కాటమయ్య పండుగలుంటయ్. బైండ్లోళ్ల కథలుంటయ్. చిందోళ్ల పాటలుంటయ్. కుల వృత్తులోళ్ల కండ్లల్లో ఆనందం ఉంటది. పీర్లు దూలాడుతయ్. సబ్బండ జాతులు దుంకులాడుతయ్.. ఊరుమ్మడి ఉత్సవాలుంటయ్. బతుకమ్మల వైభోగం. దసరా పండుగ ధూమ్ ధామ్. ఓ డెబ్బై ఏండ్ల కిందటి తెలంగాణ ముఖచిత్రం మళ్లీ పునర్జీవం పోసుకుని కండ్లకు కనిపిస్తది.

> కాళేశ్వరమే లేకుంటే ఈ నీళ్లెక్కడియి? 25 లక్షల ఎకరాల్లో ఈ పచ్చదనం ఎక్కడిది? మూడు కోట్ల మెట్రిక్ టన్నుల ఆ ధాన్యపు రాశులెక్కడియి? ఈ సాంస్కృతిక పునర్జీవనం ఎక్కడిది? అచ్చోసుకున్న పిట్ట వాలిన చెట్టు పుస్తకాలెక్కడియి? పుట్టి బుద్దెరిగినప్పటి నుంచే కాదు.. ఓ వెయ్యేండ్ల చరిత్ర తోడి చూసుకున్నా! ఇంత ధాన్యం పండిన ఆనవాళ్లు దొరుకుతాయా? అసెంబ్లీలో చర్చ జరగాల్సింది మళ్లీ అదృశ్యపు అంచునున్న ఇటువంటి అపురూప దృశ్యాలపై కదా! పిల్లర్ల కుంగుబాటుపై ఎన్నడైనా విచారణ చేయవచ్చు.. ఎప్పుడైనా విచారం వ్యక్తపరచవచ్చు. కానీ, అదునుదాటితే తిరిగి రాదు. కుంగిన నాలుగు పిల్లర్లు తిరిగి పునరుద్ధరించడానికి మాత్రం ఇదే అదును.

మార్చి, ఏప్రిల్, మే నెలల్లో నదీ ప్రవాహం ఉండదు. ప్రభుత్వానికి కాళేశ్వరాన్ని కొనసాగించే ఉద్దేశమే ఉంటే ఈ మూడు నెలల్లోనే మరమ్మతులు పూర్తి చేయాలి. ఇప్పుడు చర్చ జరగాల్సింది ఈ అంశంపై కదా! పోనీ బాగు చేయటం సాధ్యం కాదనుకుంటే కాళేశ్వరం ప్రాజెక్టు ఇక ముగిసిన అధ్యాయమని ప్రకటన చేయాలి కదా. ఇవేమీ చేయకుండా విలువైన సమయాన్ని వృథా చేయడాన్ని తెలంగాణ రైతాంగం చూస్తు ఊరుకోదు.

## కాలికి గాయమైతే!

కాలికి గాయమైందని
నడక మానేద్దామా
తలనొప్పి వేధిస్తుందని
తలదీసి మొలేద్దామా?

భుజం మోపి నిలిచాక
భారం మోయక తప్పదు
అంచనాల్లేని గ్యారెంటీలు
అమలు చేయమంటే కుదరదు!

గత పదేళ్లుగా
దాహం తాపం ఎరుగని
తెలంగాణ ప్రజానీకం
ఎగాదిగా చూస్తున్నది!

భోషాణం నిండుకుందంటే
తెలంగాణ భోజనం మానేయదు
గుప్త నిధుల మీదే ధ్యాసుంటే
గమ్యమెప్పటికీ అయోమయమే!

మంత్రాలకు
చింతకాయలు రాలనప్పుడు
కాళేశ్వరం కాలి వేలు తెగిందన్నా
భూనభోంతరాలు దద్దరిల్లవు!

నిప్పుల మీద
నడిచిన చరిత్ర నీకుంటే
నిజానిజాలు నిగ్గు తేల్చి
జనం ముందు స్వేద పత్రమవ్వాలి!



కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

## మేధావులూ.. మౌనం వీడండి

కాంగ్రెస్ పార్టీని గెలిపించి తప్పు చేశామా! అనే సందిగ్ధంలో పడింది తెలంగాణ సమాజం. అలవికాని హామీలను అమలు చేయలేక సతమతమవుతున్న రేవంత్‌రెడ్డి సర్కార్ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నది. ఆరు గ్యారెంటీల అమలు దేవుడెరుగు.. గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను అమలు చేయలేక వాటికి మంగళం పాడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం.



జి.రాజేష్ నాయక్
96035 79115

ప్రజాపాలన అని గప్పాలు కొడుతున్న కాంగ్రెస్‌పై ప్రజలు మండిపడుతున్నారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే హస్తం సర్కార్ అసలు రంగు ఏంటో బయటపడింది. ప్రజాక్షేత్రంలో వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోకపోతే ఏ పార్టీ అయినా మనుగడ సాగించలేదు. దశాబ్దాల పాటు పాలించిన పార్టీలకు ప్రజల నాడి తెలుసుకునే నైపుణ్యం మెండుగా ఉండాలి. ఇష్టం వచ్చినట్టు పాలిస్తామంటే.. ఆదరించిన ప్రజల నుంచే చీదరింపులు తప్పవు.

ప్రజలను మభ్యపెట్టి అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ పాలనా అనుభవమే లేని రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసింది. అధికారం లేనప్పుడు కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న రేవంత్.. పదవీ బాధ్యతలు స్వీకరించాక కూడా అదే పంథాను అనుసరించడాన్ని చూసి తెలంగాణ సమాజం నవ్వుకుంటున్నది. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలన, కేసీఆర్ చేసిన అభివృద్ధి, తెలంగాణ ప్రగతిని చూసి యావత్ దేశం గర్వపడింది. చేసిన అప్పుల కంటే సుమారుగా 16 రెట్లు ఎక్కువ సంపదను సృష్టించారు కేసీఆర్. తెలంగాణ సంక్షేమ పథకాలను పక్క రాష్ట్రాలు గుర్తించి తమ రాష్ట్రాల్లో అమలు చేశాయి. ఇవేవీ కాంగ్రెస్ నాయకుల కండ్లకు కనిపించటం లేదు.

పేదల పక్షపాతి అయిన కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించని అనేక పథకాలను ప్రవేశపెట్టారు. రైతుబంధు, దళితబంధు, కేసీఆర్ కిట్, రైతు బీమా, పోషకాహార కిట్.. ఇలా చెప్పుకుపోతే అనేక పథకాలు ఉన్నాయి. కానీ, సోషల్ మీడియాలో, అనుకూల పత్రికల్లో, టీవీల్లో తప్పుడు ప్రచారాలు చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 'డిసెంబర్ లోనే పెంచిన పింఛన్లను అందిస్తాం, ఫిబ్రవరి 1న జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం, డిసెంబర్ నుంచే కరెంట్ బిల్లులను సోనియాగాంధీ కడుతుంది' అని చెప్పి ఆ పార్టీ అధికార పీఠాన్ని అధిరోహించింది. డిసెంబర్ 9న రైతుభరోసా కింద ఎకరానికి రూ.15,000 ఇస్తామని చెప్పి, గత ప్రభుత్వం అందించినట్టే రూ.10,000 మాత్రమే కాంగ్రెస్ ఇచ్చింది. అది కూడా అంతంతమాత్రంగానే. ఇక కౌలు రైతులకు ఇస్తామన్న రైతు భరోసా ముచ్చటే లేదు. ప్రభుత్వం ఏర్పడిన మరునాడే చేస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీ ఊసేలేదు.




రెండు నెలలు గడిచిపోయినా ఇవేవీ అమలు చేయలేదు. ఎందుకు అమలు చేయలేదని ప్రతిపక్షం ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ నేతలు అవహేళన చేస్తున్నారు. 'ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కూడా కాలేదు. అప్పుడే ఎలా అమలు చేస్తాం' అని ఎదురుదాడి చేస్తున్నారు. ఇది సరికాదు. గత ప్రభుత్వం పథకాల అమలుకు తేదీలను ప్రకటించలేదు. పథకాలను అమలు చేసే తేదీలను ముందే ప్రకటించింది కాంగ్రెస్‌పార్టీ. కాబట్టి, తెలంగాణలోని విద్యావంతులు, మేధావులు తప్పకుండా ప్రశ్నిస్తారు. అది మేధావుల హక్కు.

ఏ ప్రభుత్వమైనా ప్రజాసంక్షేమం కోసం ఎంతో కొంత అప్పులు చేయక తప్పదు. భారతదేశంలో ఏ రాష్ట్రం అప్పులు చేయలేదో కాంగ్రెస్ నాయకులు చూపించగలరా? తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశారని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విరుచుకుపడ్డ రేవంత్‌రెడ్డి ఇప్పుడు అప్పుల వేటలో పడ్డారు. అధికారంలోకి వచ్చిన 2 నెలల్లోనే బ్యాంకులు, ఆర్థిక సంస్థల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కేసీఆర్ సంపదను సృష్టించి.. పథకాలను అమలు చేశారు. అందుకే ఆయన హయాంలో ఏ సంక్షేమ పథకం మధ్యలో ఆగలేదు. పాలన చేతకాని రేవంత్ సర్కారు మాత్రం తప్పుడు ఆరోపణలు చేస్తూ కాలయాపన చేస్తున్నది.

> సబ్బండ వర్గాల ప్రజలు రోడ్లమీదకు వచ్చి తెలంగాణ ఉద్యమాన్ని నడిపించారు. లాఠీ దెబ్బలు, భాష్పవాయుగోళాలకు ఎదురు నిలబడ్డారు. కేసులు లేనటువంటి, జైలుకు వెళ్లని ఎంతో మంది ఉద్యమకారులు ఉన్నారు. వారంతా తాము ఉద్యమకారులమని ఎలా నిరూపించుకోవాలి. ఈ షరతు తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఉద్యమకారులను అవమానించటమే అవుతుంది.

ప్రగతి భవన్ వద్ద నాడు కాంగ్రెస్ ప్రభుత్వమే ఇనుపకంచెలను ఏర్పాటు చేసింది. అధికారంలోకి వచ్చాక వాటిని తొలగించి.. ఏదో గొప్ప పని చేశామని గప్పాలు కొడుతున్నారు. జ్యోతిబాపూలే ప్రజా భవన్ అని బోర్డు పెట్టటం కాదు, ఆయన ఆశయాల కోసం పని చేయాలి. ప్రజావాణిలో ఒకేఒక్క రోజు ప్రజలను కలిసిన ముఖ్యమంత్రి దాన్ని విపరీతంగా ప్రచారం చేశారు. మళ్లీ ముఖ్యమంత్రి ప్రజలను కలిసింది లేదు. ప్రతి రోజు ప్రజావాణి ఉంటదని చెప్పి.. మాట మార్చారు. ఆ తర్వాత వారానికి రెండు రోజులే పెట్టి.. ముఖ్యమంత్రికి బదులు ఓ మంత్రి దాని బాధ్యతలు చూసుకుంటారని చెప్పారు. కానీ, ఇప్పుడు అక్కడ ఎవరూ ఉండటం లేదు. ఇదా ప్రజాపాలన అంటే? తెలంగాణ ప్రజలారా! ఒక్కసారి ఆలోచించండి. ఏది ప్రజా ప్రభుత్వమో? తెలంగాణ మేధావులారా మౌనం వీడండి. మీ మౌనం తెలంగాణకు ఎంతో నష్టం చేస్తుంది. తస్మాత్ జాగ్రత్త!




## బీజేపీకి ప్రత్యామ్నాయం ఆప్

*దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయం ఆమ్ ఆద్మీ పార్టీయే. ఆప్ ఒక్కటే ఆ పార్టీకి చాలెంజ్ విసిరేది. అందుకే ఆప్‌ను నిలువరించేందుకు మోదీ సర్కార్ శత విధాలా ప్రయత్నిస్తున్నది. అన్నీ వైపుల నుంచి ఆప్‌పై, నాపై బీజేపీ దాడులు చేస్తున్నది. నన్ను అరెస్టు చేసి జైల్లో వేయగలరేమో. కానీ, నా ఆలోచనలను కాదు.*



**- అరవింద్ కేజ్రీవాల్,** ఢిల్లీ ముఖ్యమంత్రి



## రైతు పంటకు మద్దతు ఇవ్వరా!

'ఢిల్లీ చలో' మార్చ్ ప్రధాన డిమాండ్లలో ఒకటి కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)పై చట్టపరమైన హామీ. ఎంఎస్పీకి హామీ ఇవ్వడం వల్ల ప్రభుత్వ ఆర్థిక వ్యయం పెరుగుతుందని ప్రజలను గందరగోళానికి గురిచేయడానికి మీడియా ఆధారిత కథనాలకు ప్రభుత్వం ఆజ్యం పోస్తున్నది. ఏడాదిపాటు సాగిన కిసాన్ ఆందోళనలో అప్పుడు నిరసన తెలిపిన రైతులు చేసిన ప్రధాన డిమాండ్లలో మొదటిది మూడు వ్యవసాయ సంస్కరణ చట్టాలను రద్దు చేయడం. రెండోది ఎంఎస్పీపై చట్టపరమైన హామీ. మోదీ ప్రభుత్వం చివరికి మొదటిదానికి అంగీకరించినప్పటికీ, రెండోదానికి ఎప్పుడూ కట్టుబడి లేదు.



సాయి లోహిత పులపా

ఎంఎస్పీని చట్టబద్ధం చేయడానికి ప్రభుత్వానికి రెండు మార్గాలున్నాయి. మొదటిది ఎంఎస్పీ చెల్లించాలని ప్రైవేటు కొనుగోలుదారులపై ఒత్తిడి చేయడం. దాంతో మండీ వేలంలో బిడ్డింగ్‌కు ఫ్లోర్ ప్రైస్‌గా కూడా ఎంఎస్పీ పని చేస్తుంది. ఇప్పటివరకు ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్పీని చెల్లించాలనే నిర్బంధం ఏ పంటకూ లేదు.

రెండో మార్గం ఏమిటంటే, రైతులు పండించే మొత్తం పంటను ప్రభుత్వమే ఎంఎస్పీ ప్రకారం కొనుగోలు చేయడం. సామాజిక సంక్షేమం, వ్యవసాయ సబ్సిడీలు, ఇతర ముఖ్యమైన పథకాల మాదిరి ఇది కూడా రైతులకు ప్రయోజనకరమే.

2019-20లో ఆందోళనకు ముందు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వంటి ప్రభుత్వ సంస్థలు 38.99 మెట్రిక్ టన్నుల గోధుమలను ఎంఎస్పీ ప్రకారం కొనుగోలు చేశాయి. 105.23 లక్షల బేళ్ల పత్తి (ఎంఎస్పీ విలువ రూ.28,202 కోట్లు), 2.1 మెట్రిక్ టన్నుల శనగలు (రూ.10,238 కోట్లు), 0.7 మెట్రిక్ టన్నుల కందిపప్పు (రూ.4,176 కోట్లు), వేరుశనగ (రూ.3,614 కోట్లు)లను కొనుగోలు చేశాయి.

> ఎంఎస్పీ హామీ వల్ల ప్రభుత్వానికి రూ.17 లక్షల కోట్ల భారం పడుతుందన్న మోదీ ప్రభుత్వ అంచనా తప్పు. నిర్దేశిత పథకం లేదా ధరల స్థిరీకరణ నిధిలో భాగంగా ఎంఎస్పీని చెల్లించేందుకు ప్రభుత్వానికి వాస్తవ వ్యయం రూ.50,000 కోట్లకు మించకపోవచ్చు. 2019-20లో ఉత్పత్తి అయిన 23 రకాల పంటల మొత్తం ఎంఎస్పీ విలువ సుమారు రూ.10.78 లక్షల కోట్లు. అయితే ఈ ఉత్పత్తులన్నీ మార్కెటింగ్ కావు. రైతులు దానిలో కొంత భాగాన్ని స్వీయ వినియోగం కోసం, తదుపరి సీజన్ విత్తనం కోసం నిల్వ చేసుకుంటారు.

వివిధ పంటల మార్కెట్ మిగులు నిష్పత్తి రాగులకు 50%, జొన్నలకు 65-70%, గోధుమలకు 75%, వరికి 80%, చెరకుకు 85%, పప్పుధాన్యాలకు 90%, పత్తి, జనపనార, సోయాబీన్, పొద్దుతిరుగుడు పంటలకు 95 శాతానికి పైగా ఉంటుందని అంచనా. సగటున 75 శాతం తీసుకుంటే రూ.8 లక్షల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుంది. ఇది రైతులు వాస్తవంగా విక్రయించే మార్కెట్ చేయదగిన మిగులు. అయితే ఇప్పటికే వరి, గోధుమలు, పత్తి, పప్పుధాన్యాలు, నూనెగింజలు మొదలైన వాటిని ఎంఎస్పీకి కొనుగోలు చేస్తున్నందున, మిగిలిన వాటికి ఎంఎస్పీ చెల్లింపునకు ప్రభుత్వం గణనీయమైన అదనపు ఆర్థిక వ్యయాన్ని చేయాల్సిన అవసరం లేదు.

భారతీయ నగరాల్లో పంటల రిటైల్ మార్కెటింగ్‌లో కనిపించే మధ్య తరగతి లాభదాయక పద్ధతుల కారణంగా, పంటలు, కూరగాయలు లేదా మిగిలిన ఉత్పత్తులను పట్టణ మార్కెట్లో విక్రయించే 'అధిక ధర'లో రైతులకు సరైన వాటా లభించడం లేదు. పెరుగుతున్న పట్టణ వినియోగదారుల పక్షపాతం, ఎగువ మధ్యతరగతి ఆదాయ సమూహాలు, సంపన్న వర్గాల మధ్య చెల్లించడానికి అధిక సుముఖత రైతు సంక్షేమాన్ని పణంగా పెట్టి వ్యవసాయ వస్తువులను మధ్యతరగతి (మధ్యవర్తి)కి లాభసాటిగా చేయడానికి సహాయపడుతుంది. అందుకే గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఎంఎస్పీతో ఎక్కువ ధర ఆధారిత రక్షణ అవసరం.

తప్పుడు బడ్జెట్ వ్యూహాలు, ప్రభుత్వం ఎదుర్కొంటున్న నిశ్శబ్ద ఆర్థిక సంక్షోభం కారణంగా ఎంఎస్పీ వంటి అంశాల్లో రైతులను ఆదుకోవడానికి మోదీ ప్రభుత్వానికి ఆసక్తి సన్నగిల్లింది. కేంద్ర బడ్జెట్లలో వ్యవసాయ ఆధారిత సబ్సిడీలకు, అవసరమైన వ్యయానికి ఆర్థిక ప్రాధాన్యత కొరవడింది. వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు మొత్తం కేటాయింపుల్లో 2022-23లో వాస్తవ వ్యయంతో పోలిస్తే 22.3 శాతం క్షీణత, 2023-24 సవరించిన బడ్జెట్‌తో పోలిస్తే 6 శాతం క్షీణత నమోదైంది.

మోదీ ప్రభుత్వం వరుసగా పదోసారి రైతు వ్యతిరేక బడ్జెట్‌ను ఆమోదించిందని ఇటీవలి మధ్యంతర కేంద్ర బడ్జెట్ తర్వాత అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) విమర్శించింది. స్వామినాథన్ చెప్పిన సీ2+50% అంచనాల ప్రకారం కనీస మద్దతు ధరలు కల్పించాలన్న రైతుల చిరకాల డిమాండ్ సాకారమయ్యేలా కేటాయింపులు లేవని ఏఐకేఎస్ వ్యాఖ్యానించింది.

2024-25లో ఎరువుల సబ్సిడీకి కేటాయింపులు 2022-23 వాస్తవ వ్యయం కంటే రూ.87,218 కోట్లు తక్కువ. ఆహార సబ్సిడీకి 2022-23లో వాస్తవ వ్యయం కంటే రూ.67,552 కోట్లు తక్కువగా కేటాయించారు. రైతులు, గ్రామీణ భారతం పట్ల ఆర్థిక ప్రాధాన్యత లేకపోవడమే కాకుండా తన ఆర్థిక విధానంలో ప్రైవేటు రంగాన్ని మోదీ ప్రభుత్వం ఎలా ప్రోత్సహిస్తుందో ఈ స్థూల ఆర్థిక గణాంకాల ద్వారా తెలుస్తుంది. రైతు సంక్షేమం, ఆర్థిక శ్రేయస్సును పణంగా పెట్టి వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ దిశగా ప్రోత్సహించే వ్యూహాన్ని అవలంబించడానికి సిద్ధంగా ఉందని స్పష్టమవుతున్నది.